క్లుప్తంగా

ఆలయంలో శుభ్రత పనులు



కుండలేశ్వర స్వామి ఆలయాన్ని శుభ్రం చేసిన గుడి - బడి శిష్యుల బృందం

కాట్రేనికోన: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త వద్దిపర్తి పద్మాకర్ గురువు ఆదేశాలతో గుడి-బడి శిష్యుల బృందం ఆదివారం ప్రాచీన స్థానిక పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి ఆలయాన్ని శుభ్రం చేసింది. కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి, వేంటేశ్వరస్వామి, కనకదుర్గమ్మ ఆలయాలను గుడి-బడి శిష్యుల బృందం శుభ్రం చేసింది. దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వేద పాఠశాలలు, గోశాలలను శుభ్రం చేయడం మనందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. అనంతరం శిష్యుల బృందం పార్వతీ సమేత కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కాళ్లకూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో వద్దిపర్తి పద్మాకర్ శిష్యులు వేద పారాయణ చేశారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష



అమలాపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

అమలాపురం టౌన్: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ స్పర్శ్ యోజన (స్కాలర్‌షిప్ ప్రమోషన్ ఆఫ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఇన్ స్టాంప్స్ హాబీ) పరీక్షను స్థానిక శ్రీవాగ్దేవి స్కూలులో అమలాపురం డివిజన్ పోస్టల్ అధికారులు ఆదివారం నిర్వహించారు. డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పరీక్ష జరిగింది. స్కాలర్‌షిప్ పరీక్షలు విజయవంతంగా జరిగాయని ఆయన అన్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 195 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పోస్టల్ శాఖలో విడుదలైన అనేక రకాల స్టాంప్స్‌పై అవగాహన, జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించేందుకు ఇలాంటి స్కాలర్‌షిప్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీటీఓకు సత్కారం



ఏసీటీఓ స్వామినాయుడిని సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా అమలాపురం సీటీఓ కార్యాలయంలో ఏసీటీఓగా పనిచేస్తున్న రోళ్ల స్వామినాయుడు నియమితులయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల సమావేశం నాయుడిని అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించింది. ఈ మేరకు ఆదివారం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారులు స్థానిక వెండి బంగారు వర్తక సంఘం భవనంలో ఏసీటీఓ స్వామినాయుడిని ఘనంగా సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, సలహాదారు నల్లా పవన్, గౌరవ కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, బంగారు, వెండి వర్తకుల సంఘ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ ప్రతినిధులు వలవల శివరావు, అనుపోజు శ్రీను, కట్టోజు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

కాట్రేనికోన: స్థానిక గేటు సెంటర్ నుంచి పోలీస్ క్వార్టర్స్ వరకూ రూ.64 లక్షల ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం మార్కెటింగ్ చైర్మన్ ఓగూరు భాగ్యశ్రీ, సర్పంచి గంటి వెంకట సుధాకర్, చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, విత్తనాల బుజ్జి తదితరులు ఉన్నారు.

'కొత్త ఉదయం' పుస్తకావిష్కరణ

అమలాపురం రూరల్: బండారులంకకు చెందిన న్యాయవాది శ్రీపావని బాలల హక్కులపై రచించిన 'కొత్త ఉదయం' అనే పుస్తకాన్ని శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు భీమవరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఈ పుస్తకాన్ని ఉచితంగా అందించనున్నట్లు రచయిత్రి శ్రీపావని తెలిపారు.

బాధితురాలికి సాయం

ఐ.పోలవరం: భైరవపాలేనికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి సీఎం సహాయ నిధి నుంచి ప్రభుత్వం విడుదల చేసిన రూ.ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. గ్రామానికి చెందిన కామాడి అభి గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో చేతిని కోల్పోయింది. ఈ మేరకు ఆమెకు రూ.ఐదు లక్షల పరిహారం చెక్కును ఎమ్మెల్యే సుబ్బరాజు ఇచ్చారు.

ఏమాత్రం బెధరకుండా..

- రైతుబజారులో పట్టిక ధరలకు మించి అమ్మకాలు
- లబోదిబోమంటున్న వినియోగదారులు

అమలాపురం టౌన్: ధరల పట్టిక పెడతారు.. చూసి కొని డబ్బులిస్తే పెంచి చెబుతారు.. అమలాపురం రైతుబజారులో రోజూ ఉదయాన్నే ధరల పట్టిక పెడుతున్నా, దాని ప్రకారం అమ్మకాలు సాగడం లేదు.. అధికారుల పర్యవేక్షణతో లేక కూరగాయలను అధిక ధరలకు అమ్మేస్తున్నారు. ఉదాహరణకు కొన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.26, రూ.28 ఉంటే రూ.30కి.. అలాగే రూ.36, రూ.38 ఉంటే రూ.40కు విక్రయిస్తున్నారు. అయితే రైతుబజార్ వద్ద రోజూ అధికారులు పెట్టిన ధరల పట్టిక అనుగుణంగానే అమ్మాలని కొందరు వినియోగదారులు మొత్తుకుంటున్నా కొంతమంది దుకాణదారులు వారి మాటను పెడచెవిన పెడుతున్నారు. ఇదే సమస్యపై వినియోగదారులు రైతుబజారును పర్యవేక్షించే అధికారి దృష్టికి తీసుకు వెళ్లారు. అధికారిక ధరల పట్టిక ఉండగా దాని ప్రకారమే కూరగాయలను అమ్మాలి. అలా అమ్మితే రైతు బజారు లక్ష్యానికి విరుద్ధమే. రైతు బజార్‌లో 90 దుకాణాలకు సరిపడే షెడ్లు ఉన్నా, అందులో 24 దుకాణాల్లో మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందులో 15 కూరగాయల, 9 ఉల్లిపాయలు దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఓ కిరాణా, రెండు నిమ్మకాయల దుకాణాల నిర్వహణ జరుగుతోంది. మిగిలిన దుకాణాలు, షెడ్లు ఖాళీగానే ఉన్నాయి.



అమలాపురంలో రైతుబజారు

ప్రచారం గొప్ప.. నిర్వహణ లేదబ్బ

స్థానిక రైతుబజారులో ధరల పట్టిక అనుగుణంగా అమ్మకుండా వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతుంటే ప్రభుత్వం, అధికారులు మాత్రం రైతుబజార్ల పేరుతో విస్తృత ప్రచారం చేసుకుంటోంది. దళారుల ప్రమేయం లేకుండా కూరగాయలు పండించే రైతులే ఇక్కడ అమ్మతారని చెబుతోంది. బయట మార్కెట్‌లో కంటే రైతుబజార్‌లో కూరగాయల ధరలు తక్కువని ప్రచారం చేస్తోంది. అయితే అనధికారికంగా కొన్ని రకాల కూరగాయలపై కిలోకు రూ.2 నుంచి రూ.4 ఎక్కువ అమ్ముతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పైకి మాత్రం చిల్లర లేక, ఇవ్వలేక రౌండ్ ఫిగర్‌కు కూరగాయల బరువును సరిపెట్టి తూస్తున్నామని దుకాణదారులు చెబుతున్న కారణానికి వినియోగదారులు ససేమిరా అంటున్నారు. అధికారులు కూడా అధిక ధరలకు అమ్మినట్లు ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు స్పందించి చర్యలు చేపతున్నారు. అదే ధరలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ, నిఘా ఉంటే ఇబ్బంది ఉండదని వినియోగదారులు అంటున్నారు.

రైతుల ముసుగులో వ్యాపారం

వాస్తవంగా రైతు బజార్‌లో కూరగాయలను అమ్మేందుకు కొన్ని నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నాయి. రైతు తన కమతంలో కూరగాయలను పండించి వాటిని రైతుబజారుకు తరలించి అతనే వాటిని అమ్ముకోవాలి. ఈ విధానంతో దళారుల ప్రసక్తే లేకుండా తాజా కూరగాయలను సరసమైన ధరలకు వినియోగదారుడికి అందించాలన్నది అంతిమ లక్ష్యం. అయితే రైతుబజారులో కూరగాయల దుకాణాలు నిర్వహించే కొందరు రైతుల పేరుతో వాటిని అమ్మే వ్యాపారులు ఉన్నారు. జిల్లా మార్కెంగ్ శాఖ పర్యవేక్షణలో రైతు బజార్లు నడుస్తున్నాయి. ఈ బజార్‌లో కూరగాయలు అమ్ముకునేందుకు అధికారులు రైతు ఫొటోతో పాటు ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. అసలు రైతులతో పాటు కూరగాయల అమ్మే వ్యాపారులకు సైతం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో అసలు, కొసరు రైతులు, వ్యాపారుల కలియికతో రైతుబజార్ నిర్వహణ సాగుతోంది.



రైతుబజారులో ధరల పట్టిక

అధిక ధరలకు అమ్మితే చర్యలు

> రైతుబజారులో రోజూ ఉదయాన్నే పెట్టే ధరల పట్టిక అనుగుణంగా కూరగాయల అమ్మేలా పర్యవేక్షిస్తున్నాం. ఎవరైనా పట్టిక నిబంధనలు దాటితే తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఇద్దరు దుకాణదారులు అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు రాగానే విచారణ చేపట్టి వారిని సస్పెండ్ చేశాం. రైతుబజారులో దళారుల వ్యవస్థ లేకుండా చూస్తున్నాం.
>
> – బి.సతీష్‌కుమార్, ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజార్, అమలాపురం

నకిలీ మద్యంపై నేడు వైఎస్సార్ సీపీ నిరసన

- ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన
- పార్టీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం టౌన్: నకిలీ మద్యానికి వ్యతిరేకంగా అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సోమవారం ఉదయం నిరసన తెలపనున్నారు. ఈ నిరసనను విజయవంతం చేయాలని నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ కో ఆర్డినేటర్‌తో పాటు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్ నిరసనకు హాజరు కానున్నారు. తొలుత వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం ఉదయం 9 గంటలకు అమలాపురం సమీపంలోని భట్నవిల్లిలో మాజీ మంత్రి, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ ఇంటికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి ఎక్సైజ్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం పలుచోట్ల ఏరులై పారుతోందని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. అందుకే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ ఆందోళన చేపడుతున్నట్లు వివరించారు. ఇటీవల అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో నకిలీ మద్యం తయారీ యూనిట్ వెలుగులోకి రావడంతో ప్రజల్లో భయం మరింత పెరిగిందని అన్నారు. ఈ నిరసనకు పార్టీకి చెందిన మహిళా నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని నియోజకవర్గ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు దొంగ నాగసుధారాణి పిలుపునిచ్చారు. అలాగే ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్తీ మద్యంపై నిరసనను విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని పిలుపునిచ్చారు.

ఐ.పోలవరంలో..

ఐ.పోలవరం: రాష్ట్రంలో ఏరులై పారుతున్న నకిలీ మద్యాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందించనున్నామని మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు తెలిపారు. ఐ.పోలవరంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో నకిలీ మద్యం విచ్చలవిడిగా తయారవుతోందని ఆరోపించారు. దీనిని అరికట్టడంతో పాటు తయారు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తొలుత ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండల, రాష్ట్ర పార్టీ విభాగం, అనుబంధ విభాగాలకు చెందిన సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వెంకటపతిరాజు కోరారు.

18 నుంచి పితృదేవతా మహోత్సవాలు

అమలాపురం టౌన్: ఆశ్వీయుజ బహుళ త్రయోదశి నుంచి కార్తిక మాస శుద్ధ తదియ అంటే ఈ నెల 18వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ అర్ధరాత్రి వరకూ శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో పంచ దివస పితృదేవతా పూజా మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమలాపురం పోలీస్ గ్రౌండ్స్ సమీపంలోని ప్రణవనాద నిలయంలో జరగనున్న ఈ మహోత్సవాల్లో తొలుత ఈ నెల 19న యమ ధర్మరాజు సహిత పితృదేవతా అఖండ హోమం నిర్వహిస్తామని అక్షయ పాత్ర సంస్థ వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గాదేవి తెలిపారు. 18న సాయంత్రం 4 గంటలకు మహోత్సవాలు ప్రారంభం సూచికగా గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. ఇదే సందర్భంగా స్థానిక పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం నుంచి పోలీస్ గ్రౌండ్స్ వరకూ రథయాత్ర జరుగుతుందని చెప్పారు. 24వ తేదీ వరకూ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఆఖరి రోజున పూర్ణాహుతితో ముగిస్తాయన్నారు. ఈ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ప్రణవనాద నిలయం ప్రాంగణంలో అక్షయ పాత్ర ప్రతినిధులు ఆదివారం విడుదల చేశారు. అక్షయ పాత్ర సేవకులు గొవ్వాల అచ్యుతరామయ్య, అరిగెల బుజ్జి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మహోత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ సేవకులు

ఆపద సమయంలో బీమా రక్షణ కవచం

తాళ్లరేవు: ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు బీమా రక్షణ కవచంగా నిలుస్తుందని బజాజ్ క్యాపిటల్స్ సంస్థ బ్రాంచి మేనేజర్ మోర్త రాజేష్ తెలిపారు. ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రమాద బీమా చేయించుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే అతని కుటుంబానికి పెద్ద మొత్తంలో నగదు అందుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం కలుషితమైన ఆహారం, అధిక ఒత్తిడి కారణంగా అనేక మంది రోగాల బారిన పడుతున్నారని, అటువంటి వారికి ఆరోగ్య బీమా కొండంత అండగా ఉంటుందన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా బాండ్లను ఉచితంగా అందజేశారు. సంస్థ సిబ్బంది కట్టా రాజేష్, బి.పెదకాపు, అఖిల్, విజయలక్ష్మి, శ్యాంసు నీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో దంపతులకు ప్రమాద బీమా బాండ్లను ఉచితంగా అందజేస్తున్న రాజేష్ తదితరులు

బుద్ధవిహార్‌లో రేపు ప్రత్యేక కార్యక్రమాలు

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించిన రోజును పురస్కరించుకుని 14వ తేదీ మంగళవారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని బుద్ధవిహార్ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ తెలిపారు. అమలాపురం బుద్ధ విహార్‌లో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పంచశీల, పారాయణ జరుగుతుందని, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రముఖ బౌద్ధ ఉపాసకులచే ప్రసంగాలు ఉంటాయన్నారు. 3 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా బీఎస్ఐ అధ్యక్షుడు కాశీ రాంబోధి, ఉపాసకులు కె.రామమూర్తి, కాశీ వెంకట్రావు, బీఎస్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఉండ్రు శ్యామలరావు, చిలకపాటి సాంబశివరావు, బాలయోగీశ్వరావు, గోసంగి సంపదరావు, ఉండ్రు రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధవిహార్ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్

వైభవంగా మహా కుంభాభిషేకం

ముమ్మిడివరం: మండలంలో గాడిలంక సంతాన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వాములచే మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది స్వాములు 108 కలశాలతో స్థానిక వృద్ధ గౌతమీ గోదావరి నదీ జలాలను ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొత్తలంక బాబ్జి శర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య తొలిత గణపతి పూజ, సుబ్రహ్మణ్య పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ శిఖరంపై 108 కలశాలతో తీసుకు వచ్చిన నదీ జలాలతో అభిషేకం జరిపారు. అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వాముల శరణ ఘోషతో కుంభాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వాములు ఆసు మాణిక్యంస్వామి, కొమ్మిరెడ్డి సురేష్‌కుమార్, నాగరాజు, శ్రీను, సత్యనారాయణ, మొల్లేటి లక్ష్మణ స్వామి, గిరిగి కోదండపాణి, ఆలయ నిర్వాహకులు గిరిగి సాయిరామ్, పిండి లక్ష్మణరావు, కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గాడిలంకలో సంతాన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కలశ పూజ చేస్తున్న స్వాములు

గోదావరిలో మునిగిన పడవ

త్రుటిలో తప్పిన ప్రమాదం

ముమ్మిడివరం: మండలంలోని లాంకాఫ్ ఠానేలంక గ్రామంలో గోదావరి ఒడ్డు జారి, రైతులు ప్రయాణిస్తున్న పడవపై కూలడంతో నావ మునిగిపోయింది. ఆ పడవలో పది మంది రైతులు ఉండగా, వారు గోదావరిలోకి దూకి ప్రాణాలు కాపాడుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైతులంతా ఈదుకుంటూ సురక్షితంగా బయట పడడంతో లంకవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి ఒడ్డు సీసీ రోడ్డుతో సహా నదిలోకి జారిపోయింది. వరదలు, భారీ వర్షాల కారణంగా నదీ కోతలు అధికమయ్యాయని ఏ సమయంలో ఏం జరుగుతుందోనని లంక వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోత నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



పడవ మునిగిపోవడంతో క్షేమంగా ఒడ్డుకు చేరుతున్న రైతులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అంబాజీపేటలో కొబ్బరితోటలో దున్నుతున్న రైతు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. అక్టోబర్ చివర వారంలోను, నవంబర్ నెలలో కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు ఇప్పటికే రైతులకు వివరించారు. వర్షాకాలం చివరిలో కొబ్బరి రైతులు దుక్కులు బాగా చేసుకోవాలన్నారు. హరిత ఎరువులైన జనుము, పిల్లిపెసర, నత్రజని స్థాపన మొక్కల విత్తనాలను తోటల్లో చల్లుకోవాలన్నారు. కొబ్బరి కాయలను ప్రతి నెలా క్రమం తప్పకుండా సరైన సమయంలో దింపు తీసుకోవాలన్నారు. వర్షానికి ముంపునకు గురైన తోటల్లో నీటిని బయటకు పంపాలన్నారు. వర్షాధారంపై ఉన్న కొబ్బరి తోటల్లో రెండో దఫా ఎరువులను కొబ్బరి చెట్టు చుట్టూ 2 మీ దూరం, 25 సెం.మీ లోతు పళ్లాలు చేసుకోవాలన్నారు. సిఫారసు చేసిన ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్టను కోసి కొబ్బరిచెట్టు పళ్లెంలో వేసుకోవాలన్నారు. ప్రతి రైతు వీటిని ఆచరించడం వల్ల కొబ్బరితోటలకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొబ్బరి చెట్లకు తెల్లదోమ ఆశిస్తుందన్నారు. దీనిని రైతులు తొలి దశలోనే గమనించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మర్రి సత్యనారాయణ (60) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోడేకుర్రు శివారు చినలంకకి చెందిన సత్యనారాయణ ఆదివారం రాత్రి ఇంటికి సమీపాన రోడ్డు పక్కనే నడచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అయినవిల్లికి భక్తుల తాకిడి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారుజామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు స్వామికి విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 107 మంది పాల్గొన్నారు. స్వామికి ఒక భక్తుడు ఉండ్రాళ్ల పూజ జరిపారు. ఇరువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. నలుగురు చిన్నారులకు అన్నప్రాశన జరిపారు. 11 మందికి తులాభారం నిర్వహించారు. శ్రీలక్ష్మీగణపతి హోమంలో 13 జంటలు, ఏడుగురు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామికి ముగ్గురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 45 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2320 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామి వారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,52,410 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ప్రశాంతంగా విలేజ్ అసిస్టెంట్ పరీక్ష



యానాం రాజీవ్‌గాంధీ హైస్కూల్ కేంద్రంలో పరీక్షకు వస్తున్న అభ్యర్థులు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న విలేజ్ అసిస్టెంట్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (లీగల్ మెట్రాలజీ) ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆర్ఏఓ, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ మాట్లాడుతూ పరీక్ష ఏడు సెంటర్లలో ఎటువంటి ఇబ్బంది లేకుండా జరిగిందన్నారు. 1,917 మంది అభ్యర్థులకు 1,284 మంది హాజరయ్యారని అన్నారు. పరీక్ష కేంద్రాలను జోనల్ సూపర్‌వైజర్లు వినకోటి ఉషారాణి, చెల్లి నరేష్, డీటీ జ్యోతి వెంకటేశ్వరరావు, వినకోటి రత్నరాణి, పుదుచ్చేరి నార్త్ కలెక్టర్ ఇషితారథీ, అడ్వయిజర్, రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి చిత్ర, తదితరులు తనిఖీ చేశారు.

పత్తిగొందిలో 120 మంది రక్తదానం



పత్తిగొందిలో రక్తదానం చేస్తున్న శివన్నారాయణ అభిమానులు

తాళ్లరేవు: ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పత్తిగొందిలో శివన్నారాయణ స్వగృహంలో కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంకు, యువసేన బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సుమారు 120 మంది రక్తాన్ని సేకరించారు. శివన్నారాయణ 61వ సారి రక్తదానం చేశారు. అనంతరం కేకు కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో తోట రాజు, మల్లాడి సత్తిబాబు, విళ్ల సత్యనారాయణ, గంజా కాశీవిశ్వనాథ్, కామాడి మాతరాజు, దడాల హరీష్, బి.శ్రీనివాసరెడ్డి, కాలా సూరిబాబు, బండారు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవం

ఐ.పోలవరం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మురమళ్ల ఉప మండలం ఆధ్వర్యంలో విజయ దశమి ఉత్సవాలు జరిగాయి. కొమరగిరి సొసైటీ వద్ద ఆదివారం ఈ వేడుకలను నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా విజయ దశమి ఉత్సవాలను ఏర్పాటు చేశారు. ముందుగా కాషాయ ధ్వజానికి పూజలు నిర్వహించి గౌరవ నమస్కారం చేశారు. అనంతరం ఆయుధ పూజ చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఆక్వా వ్యాపారవేత్త నడింపల్లి వీర వెంకట సూర్యవర్మ హాజరయ్యారు.

ఏటిగట్టుపై దిగబడిన కారు



పెదపట్నం ఏటిగట్టుపై మట్టిలో దిగబడిన కారు

మామిడికుదురు: అర కిలోమీటరు దూరం ఉన్న ఏటిగట్టుపై పక్కా రోడ్డు నిర్మించాలని ఎంతో కాలం నుంచి ప్రజలు వేడుకుంటున్నా దాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పెదపట్నం గ్రామ ప్రజలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి పెదపట్నం రత్నాపురం వెళ్లే మార్గంలో ఏటిగట్టుపై శనివారం రాత్రి మట్టిలో కారు దిగబడిపోయింది. రాత్రి సమయం కావడం, ఇక్కడ పరిస్థితులు తెలియక పోవడంతో స్థానికేతరులు కారులో వచ్చి ఏటిగట్టుపై మట్టి రోడ్డులో కారు దిగబడిపోయి దాన్ని అక్కడే విడిచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. ఈ మార్గంలో మట్టి రోడ్డు స్థానే పక్కా రోడ్డు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎంతో దగ్గరగా ఉండే ఈ మార్గంలో ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు.